వర్షమొస్తే వణుకే..

చినుకుపడితే చెరువును తలపించేలా మూసాపేట మెట్రోస్టేషన్ పరిసర ప్రాంతాలు



ఇటీవల కురిసిన వర్షానికి చెరువును తలపిస్తున్న కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో నేషనల్ హైవే

- వర్షపునీరు వెళ్లేదెలా..? వాహనదారుల అగచాట్లు
- కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్.. రాకపోకలకు తీవ్ర ఆటంకం
- నాలా పనులు పూర్తయితేనే సమస్య పరిష్కారం

మూసాపేట: వర్షం పడితేచాలు వాగును తలపించేలా మారుతుంది ఆ రోడ్డు.ఆ ప్రాంతం మీదుగా వెళ్లాలంటే ప్రయాణికుల్లో వణుకుపుడుతోంది. ప్రతి వర్షకాలం ఇక్కడ చిన్నపాటి చెరువును తలపించేలా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తోంది. వర్షం పడిన సమయంలో రోడ్డుపై నిలిచిన మోకాల్లోతు నీటిలో ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అటూ ఇటూ కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇక ఆ వర్షపు నీరు పోవటానికి సుమారు 4 గంటల సమయం పడుతోంది. కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో నుంచి మూసాపేట మెట్రోస్టేషన్ వరకు జాతీయ రహదారి చెరువును తలపించేలా వరద ప్రవాహం ఉంటుంది. ఈ క్రమంలో భారీ వర్షాలు కురిసినా నీరు నిల్వకుండా చర్యలు తీసుకున్నారు. ఇటీవల పనులు ప్రారంభమై ముగింపుదశకు చేరుకున్నాయి.

అసలు సమస్య..

కూకట్‌పల్లి రంగనాయక చెరువు అలుగు నీరు, హబీబ్‌నగర్, శక్తినగర్, చెరువు కింది ప్రాంతం, ఆంజనేయనగర్, పవర్‌నగర్, ప్రగతి నగర్ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు వసుంధర ఆసుపత్రి వెనుక ఉన్న నాలా నుంచి ప్రవహిస్తూ ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న పెట్రోల్ బంక్ పక్కన గల ఓపెన్ నాలా నుంచి శ్మశానం మధ్య నుంచి హుస్సేన్‌సాగర్‌కు వెళ్లే నాలాలోకి కలుస్తాయి. అయితే చెరువు అలుగునీరు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే డ్రైనేజీ నీరు, వర్షపునీటితో కలిసి ప్రవహించటంతో జాతీయ రహదారి రోడ్డుకు అటువైపు నీరు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవటంతో రోడ్డుపైనే నిలిచిపోతోంది. ఇక మూసాపేట మెట్రో స్టేషన్ నిర్మాణం జరిగినప్పుడు ఇక్కడ ఉన్న కొన్ని పైపులు మూసుకుపోయాయి. నీరు నిలిచిపోవటంతో డివైడర్ మధ్యలో చిన్న పైపులు వేసి నీరు వెళ్లేందుకు చర్యలు తీసుకున్నా ఫలితం లేదు. దీంతో ఏళ్ల తరబడి చినుకు పడితే భయపడుతూ రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది.

రూ.35 లక్షల వ్యయంతో నాలా పనులు ప్రారంభం

జోనల్ కమిషనర్ అభిలాష ఆదేశాల మేరకు సుమారు రూ. 35 లక్షల వ్యయంతో ఈ నాలా పనులు ప్రారంభమయ్యాయి. ఎస్ఈ చిన్నారెడ్డి, ఇఇ సత్యనారాయణ, డిఇ ఆనంద్, ఏఈ శ్రీనివాస్‌లు రోడ్డుపై వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటున్నారు. పెట్రోల్ బంక్, ఆర్టీసీ డిపో, శ్మశానవాటిక సమీపంలో ఉన్న పైపులు మట్టితో పూడిపోవడాన్ని గమనించి మట్టిని తొలగించారు. సుమారు 30 ట్రాక్టర్ల మట్టిని తొలగించినట్లు తెలిసింది. పెట్రోల్ బంక్ సమీపం వద్ద నాలా జంక్షన్ ఉంది. ఆ జంక్షన్ నుంచి మెకానిక్ షాపుల ముందుగా మెట్రో స్టేషన్ వరకు రెండు పైపులు 6 అడుగుల ఎత్తులో ఉన్నాయి. వీటిలో ఉన్న మట్టిని తొలగించారు. 6 క్యాచ్‌పిట్‌లను ఏర్పాటు చేసి గ్రిల్స్ బిగించారు. ఇక మరో లైన్ జంక్షన్ నుంచి ఆర్టిసి డిపో వైపు వెళుతుంది. ఇక్కడ 3 అడుగుల పైపులైన్‌లు 4 ఉన్నాయి. డివైడర్ మధ్యలో పైపులను తొలగించి గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు. ఆర్టిసి డిపో వద్ద కూడా 2 ప్రాంతాల్లో ఫుట్‌పాత్ కింద నాలా పైపులు ఉండటంతో ఫుట్‌పాత్‌ను తొలగించి మరమ్మతులు చేపట్టారు. ఆర్టిసి డిపో ఎదురు నుంచి మరో పైపులైన్ శ్మశాన వాటిక వైపు వేసి మెట్రో స్టేషన్ కిందుగా ఉన్న కల్వర్ట్‌లో కలిపారు. ప్రస్తుతం ఈ జంక్షన్ నుంచి 3 దారుల్లో ఎప్పటికప్పుడు నీరు సాఫీగా వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఒకవైపు 6 అడుగుల పైపులు 2, మరో వైపు 3 అడుగుల పైపులు 4, మరో లైన్ 3 అడుగుల పైపులు 2 ఏర్పాటు చేశారు. దీంతో భారీ వర్షం వచ్చినా చుక్క నీరు మెట్రో స్టేషన్ క్రింద, డిపోవద్ద ఆగకుండా నాలాలోకి వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు పేర్కొన్నారు. దాదాపు పనులు పూర్తయ్యాయని తెలిపారు.





వర్షపు నీరు సాఫీగా వెళ్లటానికి మెట్రో స్టేషన్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన క్యాచ్‌పిట్



ఈర్ల చెరువు సుందరీకరణ పనులు పరిశీలన



ఈర్ల చెరువు పనుల గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధి ఈర్ల చెరువును రూ.7.73 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని, చెరువులో మురుగునీరు కలవకుండా ప్రత్యేకంగా కాల్వ నిర్మాణం చేపడుతున్నామని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని ఈర్ల చెరువు సుందరీకరణ పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైశాలినగర్ నుంచి ఈర్ల చెరువులో కలుషిత నీరు కలవకుండా డ్రైనేజీ మళ్లింపు పనులను వేగవంతం చేయాలన్నారు. నాణ్యత విషయంలో రాజీపడొద్దని సూచించారు. చుట్టుపక్కల కాలనీల నుంచి వచ్చే మురుగునీరు చెరువులో కలవకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెరువు సంరక్షణలో భాగంగా చెరువు చుట్టు ఫెన్సింగ్ నిర్మాణం, అలుగు, సుందరీకరణ పనులు చేపడుతున్నామన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చెరువులను సుందరీకరిస్తామన్నారు. జీహెచ్‌ఎంసీ, ఇరిగేషన్ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వామ్మో.. హోటళ్లలో ఫుడ్డా!



జూబ్లీహిల్స్ హోటళ్లలో ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ టీమ్

- 'హిల్స్' హోటళ్లలో పరిశుభ్రతకు తిలోదకాలు
- గడువుతీరిన ఆహార పదార్థాలు
- బూజుపట్టిన సరుకులు
- కిచెన్‌లో ఎలుకలు, బొద్దింకల స్వైర విహారం
- పాడైన చికెన్, మటన్ గుర్తింపు
- నోటీసులు జారీ చేస్తున్న అధికారులు
- కొన్ని హోటళ్లలో ఆహార పదార్థాల సీజ్

బంజారాహిల్స్: ఆర్భాటంగా... తళుకు బెళుకుల ఇంటీరియర్‌తో ఆకట్టుకునే ఫర్నీచర్‌తో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో ఏర్పాటవుతున్న హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్‌లలో నాణ్యతా లోపం, అపరిశుభ్రత, గడువుతీరిన ఆహార పదార్థాలు వెలుగు చూస్తుండటంతో ఆహార ప్రియులు షాక్ అవుతున్నారు. గడిచిన నాలుగు వారాల నుంచి ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ టీమ్ సభ్యులు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, అమీర్‌పేట, పంజగుట్ట, సోమాజిగూడ, లక్డీకాపూల్, ఖైరతాబాద్ ప్రాంతాల్లోని హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్‌లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఈ తనిఖీల్లో ముఖ్యంగా కిచెన్‌లలో పరిశుభ్రత పూర్తిగా లోపించిందని అధికారులు పేర్కొంటున్నారు.

- జూబ్లీహిల్స్‌లోని 16 పబ్‌లలో అధికారులు తనిఖీలు చేయగా దాదాపు అన్నింట్లోనూ నిల్వ చేసిన ఆహార పదార్థాలు గడువుతీరిన తరువాత కూడా వంటల్లో వినియోగిస్తున్నట్లు వారు నిర్ధారించారు.
- ఇక హోటళ్లలోని కిచెన్‌లలో అపరిశుభ్రత, దుర్గంధం, దుర్వాసన, ఈగలు, దోమలు, ఎలుకలు, పందికొక్కులు, బొద్దింకలు స్వైరవిహారం చేయడమే కాకుండా వంటలకు వినియోగిస్తున్న సామగ్రిపై తిరుగాడుతున్నట్లు కూడా గుర్తించారు.
- వెజిటేరియన్, నాన్ వెజిటేరియన్ పదార్థాలను ఒకే ఫ్రిడ్జ్‌లో ఒకే రాక్‌లో పెడుతుండడాన్ని కూడా అధికారులు గుర్తించారు. చాలా హోటళ్లలో కొన్ని ఆహార పదార్థాలు బూజు పట్టి కనిపించాయని దాదాపు హోటళ్లు, రెస్టారెంట్లలోని కిచెన్‌లన్నీ అపరిశుభ్రంగా కనిపించాయన్నారు..
- చాలా ఫిర్యాదుల అనంతరం ఇటీవల కాలంలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఆయా హోటళ్లలో తనిఖీలు చేశారు. చాలా హోటళ్లలో ఆహార పదార్థాలపై క్రిములు వాలుతున్నట్లుగా నిర్ధారణ అయ్యింది. ఇక చెత్త, వ్యర్థాలు వేసే డస్ట్‌బిన్లపై మూతలు లేవని, దీంతో ఈగలు, దోమలు, బొద్దింకలు స్వైర విహారం చేస్తున్నాయని అధికారులు తెలిపారు.
- కేఎఫ్‌సీ లాంటి ఇంటర్నేషనల్ చైన్ హోటళ్లపై దాడులు చేసి ఆహార పదార్థాల నాణ్యతపై నోటీసులు జారీ చేశారు.

ఉల్లంఘించిన హోటళ్ల జాబితా..

క్రీమ్ స్టోన్, నేచురల్స్ ఐస్‌క్రీమ్, కరాచి బేకరీ, కేఎఫ్‌సీ, రోస్ట్రీ కాఫీ హౌస్, రాయలసీమ రుచులు, షాగౌస్,కామత్‌హోటల్, 36 డౌన్ టౌన్ పబ్, మకావ్ కిచెన్ అండ్ బార్ పబ్, ఎయిర్ లైవ్, టాకో బెల్, ఆహా దక్షిణ్, కిజిలింగ్ జో, ఖాన్ సాబ్, హోటల్ సుఖ్‌సాగర్, జంబో కింగ్ బర్గర్స్, రత్నదీప్ రిటైల్ స్టోర్, సోమాజిగూడ కృతుంగ రెస్టారెంట్, సోమాజిగూడ రెస్ట్ ఓ బార్.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



గచ్చిబౌలి: వైట్ ఫీల్డ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరాను శనివారం నిలిపివేస్తున్నట్లు ఏఈ కిషోర్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శ్రీరామ్‌నగర్ ఏబీసీ బ్లాక్స్, గౌతమి సొసైటీ మొత్తం ప్రాంతం, మసీదుబండ విలేజ్, మసీదుబండ ఎక్స్‌రోడ్ పరిసర ప్రాంతాలు, క్యామ్‌లేట్ లే అవుట్, సీఎంసీ లేఅవుట్, మసీదుబండ ప్రధాన రోడ్డు, కళాజ్యోతి బిల్డింగ్ పరిసరాలు, కల్లు కంపౌండ్ సర్కిల్ పరిసరాలలో విద్యుత్ ఉండదని వినియోగదారులు గమనించాలన్నారు.

కొండాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

గచ్చిబౌలి: కొండాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గాయత్రి లేఅవుట్, కాంతివనం, సెంట్రల్ పార్కు ఫేజ్-2, శిల్పా వ్యాలీ, మాధవహిల్స్, జేవీ హిల్స్ వంటి ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

- 11 కేవీ వసంత సిటీ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు వసంతవిల్లాస్, సైబర్ విలేజ్, సైబర్‌వ్యాలీ, సంకల్ప్ అపార్ట్‌మెంట్స్..

మియాపూర్‌లో..

మియాపూర్: ఎస్ఆర్ ఎస్టేట్, ఏఎస్ఆర్ ఎస్టేట్, లోటస్ కాలనీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11 గంటల నుండి 12.30 వరకు మియాపూర్ మెయిన్ రోడ్డు, ఫ్రెండ్స్ కాలనీ, ఎస్ఆర్ ఎస్టేట్ అపార్ట్‌మెంట్, 1.30 నుండి 3 గంటల వరకు ప్రగతి ఎన్‌క్లేవ్, నీలిమా గ్రీన్స్ అపార్ట్‌మెంట్, ఆర్వీ నిర్మాణ్ అపార్ట్‌మెంట్, లా- గార్డినియా అపార్ట్‌మెంట్, రాధామాధవ్ అపార్ట్‌మెంట్, శ్రీ లక్ష్మీ అపార్ట్‌మెంట్,

- అదేవిధంగా 3.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు బొల్లారం రోడ్డు, డి మార్ట్ ఏరియా,నాగార్జున ఎన్‌క్లేవ్, దత్తసాయినగర్, మియాపూర్ బస్‌బాడి ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు.
- నందమూరినగర్, బృందావన్ కాలనీ,హైదర్ నగర్ ఫీడర్ల పరిధిలో.. శనివారం 11 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నందమూరినగర్, హైదర్‌నగర్, 1.30 నుండి 3 గంటల వరకు బృందావన్ కాలనీ, హైదర్‌నగర్, అలాగే 3.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు హైదర్ నగర్, బృందావన్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ హరీష్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: సుదర్శన్‌నగర్, పాపిరెడ్డి కాలనీ ఫీడర్ల పరిధిలో..

- 11 కేవీ సుదర్శన్‌నగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సుదర్శన్‌నగర్ కాలనీ, భాగ్యలక్ష్మీ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తారానగర్ ఏఈ సుమన్ తెలిపారు.
- 11 కేవీ పాపిరెడ్డికాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు పాపిరెడ్డి కాలనీ, స్ప్రింగ్ వ్యాలీ, భాగ్యలక్ష్మీ కాలనీల్లో విద్యుత్ ఉండదని ఏఈ తెలిపారు.

హఫీజ్‌పేట్: వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

- కెఎస్ఆర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జనప్రియ అపార్ట్‌మెంట్స్, కెఎస్ఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డు నంబర్లు 1 నుంచి 13, అంగార హబ్ హోటల్, ఇన్ఫినిటీ స్కూల్ ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.
- పీజేఆర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 3.00 గంటల వరకు పీజేఆర్ ఎన్‌క్లేవ్, పీజేఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డు నెంబర్లు 1 నుంచి 7, స్లేట్ స్కూల్ ప్రాంతాలలో ..
- శంకర్‌నగర్ ఫీడర్ పరిధిలో.. సాయంత్రం 3.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు చందానగర్ పోలీస్ స్టేషన్ ఏరియా, గౌతమీనగర్, శిల్పా ఎన్‌క్లేవ్, గిరిజ అపార్ట్‌మెంట్స్, వేముకుంట పార్కు తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

చందానగర్ సెక్షన్ పరిధిలో..

హఫీజ్‌పేట్, పాపిరెడ్డి సబ్‌స్టేషన్ పరిధిలో..11కేవీ ఫీడర్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- ప్రేమ్‌నగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రేమ్‌నగర్ వెనకాల వైపు, 100 ఫీట్ల రోడ్డుకు ఇరువైపుల, హఫీజ్‌పేట్, మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ బి బ్లాక్, హనీఫ్ కాలనీ ఏరియాలలో..
- మార్కెట్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రేమ్‌నగర్ వెనుక వైపు, రోలింగ్ మిడోస్, సీఎం తోట వైపు, 100 ఫీట్ల రోడ్డుకు ఇరువైపులా ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- మార్తాండనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 02.00 గంటల నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ మెయిన్ రోడ్డు, హనీఫ్ కాలనీ ఏరియాలలో ..
- వైశాలీనగర్ ఫీడర్ పరిధిలో. మ.03.30 గంటల నుంచి సాయంత్రం 05.30 గంటల వరకు వైశాలీనగర్, ఉషోదయా ఎన్‌క్లేవ్, మంజీరా పైప్‌లైన్ రోడ్డు, ఏపీఎన్‌జీఓ కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్-24 ప్రవేశ పరీక్ష

రాయదుర్గం: పాలిసెట్-2024 ప్రవేశ పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. శేరిలింగంపల్లిలోని అయిదు పరీక్షా కేంద్రాలలో మొత్తం 1085 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 920 మంది హాజరయ్యారు. శేరిలింగంపల్లి పరిధిలోని జీఐఎల్‌టీ రాయదుర్గం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాయదుర్గం, గచ్చిబౌలి,నార్సింగి, మణికొండ ప్రాంతాలలో పరీక్షా కేంద్రాలను నిర్వహించగా కేంద్రాలను పాలిసెట్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ అధికారి, జీఐఎల్‌టీ ప్రిన్సిపల్ షేక్ ఎక్బాల్ హుస్సేన్ పర్యవేక్షించారు.

పదిరోజుల్లో ఫలితాలు

- రాష్ట్రంలో పాలిసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాలను పదిరోజుల్లో ప్రకటించేందుకు ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని జీఐఎల్‌టీ ప్రిన్సిపల్ షేక్ ఎక్బాల్‌హుస్సేన్ తెలిపారు.

బీసీ కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు భేరి రాంచందర్ యాదవ్



సమావేశంలో పాల్గొన్న భేరి రాంచందర్‌యాదవ్, సభ్యులు

శేరిలింగంపల్లి: బీసీల కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు భేరి రాంచందర్‌యాదవ్ తెలిపారు. శేరిలింగంపల్లిలో బీసీ ఐక్యవేదిక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంచందర్‌యాదవ్ మాట్లాడుతూ బీసీ కులాల జనగణన నిర్వహించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా రాష్ట్రంలోని సర్పంచ్, వార్డు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ వార్డు కౌన్సిలర్, చైర్మన్ తదితర పోస్టుల్లో బీసీలకు 50 శాతం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి అధ్యక్షులు రమేష్, ఉపాధ్యక్షులు నర్సింగ్ ముదిరాజ్, యువజన విభాగం అధ్యక్షులు కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్ ఫౌండేషన్‌కు రూ.5 లక్షల విరాళం

హఫీజ్‌పేట్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌కు ప్రముఖ వాణిజ్య సంస్థ జన చైతన్య హౌసింగ్ అధినేత మాదల సుధాకర్ శుక్రవారం రూ.5 లక్షల విరాళంను డాక్టర్ నారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ ఆధ్వర్యంలో నడుస్తున్న సీఆర్ పాలిక్లినిక్, డయాగ్నొస్టిక్ సెంటర్ల నిర్వహణకు వినియోగించవలసిందిగా కోరారు. అనంతరం సీఆర్ ఫౌండేషన్‌లో వృద్ధాశ్రమంను సందర్శించారు. కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు నారాయణ, ప్రధానకార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, కోశాధికారి చెన్నకేశవరావు, హెల్త్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రజిని పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ చాలా కీలకం

సీనియర్ భారత దౌత్యవేత్త డాక్టర్ దీపక్ ఓహ్రా



నానక్‌రాంగూడలో సోషల్ ఇంటెలిజెన్స్ బూత్‌క్యాంప్‌లో పాల్గొన్న వారు

రాయదుర్గం: కమ్యూనికేషన్ అనేది కీలకపాత్ర పోషిస్తుందని భారత దౌత్యవేత్త డాక్టర్ దీపక్ ఓహ్రా అన్నారు. నానక్‌రాంగూడలో సోషల్ ఇంటెలిజెన్స్ బూత్‌క్యాంప్‌ను క్యాటలిస్ట్ సంస్థ శుక్రవారం ప్రారంభించింది. మూడు రోజులపాటు సాగే ఈ కార్యక్రమం 21 సెషన్‌లుగా ఉంటుంది. 15 మంది వక్తలు పాల్గొంటున్నారు. మొదటిరోజు కార్యక్రమానికి ముఖ్య అతిథి హాజరైన డాక్టర్ దీపక్ ఓహ్రా మాట్లాడుతూ భారతదేశం భారత్‌గా మారే సమయంలో తన గమ్యానికి నమ్మకంగా ముందుకు సాగుతున్నప్పుడే ఇది సాధ్యమవుతుందన్నారు. సాధికార కమ్యూనికేషన్ మొక్క లక్ష్యం అందరిలోనూ విశ్వాసాన్ని నెలకొల్పడం, సందేశాన్ని నమ్మదగినదిగా రూపొందించి వారి ముందుంచడం అవసరమన్నారు. అనందితా ఎం సిన్హా, హర్షవర్ధన్ ఎర్రా, మేఘన తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో శంషాబాద్ వరల్డ్ ట్రేడ్ సెంటర్ ప్రతినిధులు , విశాఖపట్నం చైర్మన్ వై.వరప్రసాద్‌రెడ్డి, సైబరాబాద్ డీసీపీ నరసింహ పాల్గొన్నారు.

అలరించిన నిథమ్ 'ఫుల్ మూన్ ఫెస్ట్'

రాయదుర్గం: కేరింతలు, ఈలలు, చప్పట్లతో గచ్చిబౌలిలోని 'నిథమ్' క్యాంపస్ దద్దరిల్లింది. నిథమ్ క్యాంపస్‌లోని హంపీ థియేటర్‌లో గురువారం రాత్రి 'నిథమ్ ఫుల్‌మూన్ ఫెస్ట్' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. నిథమ్‌లోని బీబీఏ 6వ సెమ్ విద్యార్థుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని జరిపారు. లైవ్ బ్యాండ్ ఆర్టిస్ట్ తార, డీజే రోహిత్‌ల పాటలను విద్యార్థులు, ఫ్యాకల్టీ, అధికారులు, ఉద్యోగులు ఆస్వాదించారు. సంగీతానికి అనుగుణంగా నృత్య ప్రదర్శనలు నిర్వహించారు.

హిమాచల్‌ప్రదేశ్ పర్యటనలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: హిమాచల్ ప్రదేశ్ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శుక్రవారం మనాలి ప్రాంతంలో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీ హిడింబాదేవి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, సీనియర్ నాయకులు దశరథరెడ్డి, వెంకటరెడ్డి, పాండు, మాణిక్ ప్రభు, రాజు తదితరులు ఉన్నారు.

ప్రత్యేక పూజలు.. కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం హోమం, కుంకుమార్చన, శ్రీ మహాలక్ష్మీ హోమం, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, చక్ర మండలారాధన, రథోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు భార్గవ్ లక్ష్మీనరసింహస్వామి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగుస్తున్నాయని తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

ఆల్విన్‌కాలనీ: భవ్యాస్ తులసివనంలోని శ్రీ భూసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం నవమ వార్షిక బ్రహోత్సవాలు 29వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి అభిషేకం, నిజపాద దర్శనం, విష్వక్సేనారాధన, వాస్తు హోమం, సాయంత్రం సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు. 25వ తేదీ శనివారం ధ్వజపట ప్రతిష్ఠ, సాయంత్రం తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం, శేషవాహనం, 26వ తేదీ ఆదివారం ఉదయం సర్వ భూపాలవాహనం, సాయంత్రం ఊంజల్ సేవ, హనుమంత వాహనోత్సవం, 27వ తేదీ సోమవారం ఉదయం మోహినీ పల్లకి ఉత్సవం, అన్నకూటోత్సవం, సాయంత్రం ఊంజల్ సేవ, గరుడ వాహనం, 28వ తేదీ మంగళవారం ఉదయం స్వామి రథోత్సవం, సాయంత్రం శ్రీవారి కల్యాణం, ముత్యాల పందిరి, 29వ తేదీ బుధవారం ఉదయం వసంతోత్సవం, శ్రీవారి చక్రస్నానం, సాయంత్రం అశ్వవాహనోత్సవం, ధ్వజావరోహణ, పూర్ణాహుతి వంటి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు విరివిగా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హఫీజ్‌పేట్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు.. జిలాని (70) లింగంపల్లి మార్కెట్‌లో గత 6 నెలల నుంచి చింత చిగురు, పండ్లు వ్యాపారం చేసుకుంటూ అక్కడే ఉన్న రూ.5 రూపాయల భోజనం చేసి జీవనం సాగిస్తున్నాడు. రాత్రి సమయాలలో దుకాణాల ముందు, పార్కు స్థలంలో నిద్రిస్తుండే వాడన్నారు. ఈ నెల 22వ తేదీ రాత్రి జిలానికి ఫిట్స్ వచ్చి కింద పడిపోయాడు. వెంటనే 108 అంబులెన్స్ సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. అనంతరం చందానగర్ పోలీసులు మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ మేరకు చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.